# ఆనందాలు వెల్లివిరియాలి

- సంప్రదాయబద్ధంగా ఉగాది వేడుకలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పలు చోట్ల పంచాంగ పఠనం, శ్రవణాలు

**తిరువూరు:** క్రోధాన్ని వీడి ప్రతిఒక్కరూ సుఖసంతోషాలతో జీవించాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని పలువురు పేర్కొన్నారు. శ్రీ క్రోధి నామ సంవత్సర తెలుగు ఉగాది వేడుకలు తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల్లో మంగళవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. నియోజకవర్గాల్లోని ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో, పలు ప్రాంతాల్లో, రాజకీయ పార్టీల కార్యాలయాల్లో పంచాంగ శ్రవణాలు జరిగాయి. తిరువూరు వెంకటాచలస్వామి ఆలయం, శ్రీరామలింగేశ్వరాలయం, చంద్రమౌళీశ్వరాలయం, సంతోషిమాత ఆలయం, అయ్యప్ప దేవాలయం, గౌరీకేదారేశ్వరాలయం, పాటిమీద ఆంజనేయస్వామి ఆలయం, షిర్డీ సాయి మందిరం, సత్యసాయి మందిరం, కోదండ రామాలయాల్లో పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమాలు జరిగాయి. తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వేద పండితులు కాసులనాటి సుబ్రహ్మణ్య శాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిదాసు దంపతులు, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, తిరువూరు జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ రేగళ్ల మోహన్‌రెడ్డి, విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం పాలకవర్గ సభ్యుడు దేవిశెట్టి బాలకృష్ణ, తిరువూరు నగర పంచాయతీ కౌన్సిలర్లు పసుపులేటి శేఖర్, పరసా శ్రీనివాసరావు, మోదుగు ప్రసాద్, పరసా సత్యనారాయణ, తంగిరాల వెంకటరెడ్డి, మూడు దుర్గా, నాయకులు కాలసాని గోపాల నాగేశ్వరరావు, ఇనపనూరి రవి, తిరుమలశెట్టి వేణుబాబు, యరదేశి రామారావు పాల్గొన్నారు.



తిరువూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న స్వామిదాసు, సుధారాణి, నాయకులు

- **ఇబ్రహీంపట్నం:** క్రోధి ఉగాది పర్వదినం సందర్భంగా కొండపల్లిలో మున్సిపల్ వార్డు కౌన్సిలర్ దయాసాగర్ మంగళవారం మిఠాయిలు పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ ఉగాది పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని, భవిష్యత్ బాగా ఉండాలని కోరుకున్నామన్నారు. తెలుగు సంప్రదాలయకు ప్రతీకగా ఉగాదిని జరుపుకుంటున్నామని తెలిపారు. అనంతరం అదే కాలనీలోని వృద్ధులను శాలువాలతో సత్కరించి వారి ఆశీస్సులు పొందారు.

- **ఏ.కొండూరు:** మండలంలోని చీమలపాడు, ఎ.కొండూరు, కృష్ణారావుపాలెం, రామచంద్రాపురం, కంభంపాడు, రేపూడి గ్రామాల దేవాలయాల్లో మంగళవారం క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు జరిగాయి. ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష పూజా కార్యక్రమాలు, పంచాంగ శ్రవణం జరిగాయి. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. షడ్రుచులతో చేసిన ఉగాది పచ్చడిని ప్రసాదంగా స్వీకరించారు.

- **చాట్రాయి:** క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగను మండలంలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గృహాలు, వ్యాపార సంస్థలను మామిడి తోరణాలతో అలంకరించుకుని పూజలు చేశారు. పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణ కార్యక్రమాలు నిర్వహించారు.

- **రెడ్డిగూడెం:** రెడ్డిగూడెం మండలంలో ఉగాది వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామాలలో ప్రతి ఇల్లూ మామిడి తోరణాలతో కళకళలాడాయి. షడ్రుచులతో కూడిన వేప పచ్చడి, పిండి వంటలతో ఉగాది పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో నిర్వహించిన పంచాంగ శ్రవణం కార్యక్రమాల్లో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

- **గంపలగూడెం:** మండలంలోని గ్రామాల్లో వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను మంగళవారం ఘనంగా జరిపారు. నెమలి వేణుగోపాలస్వామి ఆలయం, మేడూరు వీరాంజనేయస్వామి ఆలయం, మెట్టగుట్ట శేషాచల శ్రీనివాసస్వామి ఆలయం, ఆర్లపాడు అభయాంజనేయస్వామి ఆలయం, గంపలగూడెం రామాలయం, షిర్డీ సాయి బాబా ధ్యాన నిలయంలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. భక్తులు ఇండ్ల వద్ద పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు జరిపారు. సంప్రదాయబద్ధంగా ఉగాది పచ్చడిని తయారు చేసి దేవునికి నైవేద్యం సమర్పించిన అనంతరం భక్తులు స్వీకరించారు. వ్యాపారులు తమ నూతన దస్త్రాలను ప్రారంభించారు. పలు దుకాణాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో వ్యాపారులు పాల్గొన్నారు. నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో పురోహితుడు ఇంగువ శివప్రసాద్‌శాస్త్రిచే పంచాంగ శ్రవణం చేశారు.

**ఆగిరిపల్లి:** మండలంలో ఉగాది పర్వదినాన్ని మంగళవారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. స్థానిక విజయవాడ రోడ్డులోని దమ్మన మండపం వద్ద మంగళవారం రాత్రి క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా దేవదాయ శాఖ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామిని చంద్రప్రభ వాహనంపై గ్రామోత్సవంగా తీసుకువచ్చారు. గ్రామానికి చెందిన అర్చకులు సాంబశివరావు పంచాంగ శ్రవణం చేశారు.



మేడూరు వీరాంజనేయస్వామి ఆలయంలో పూజలు



నెమలిలో పంచాంగ శ్రవణం చేస్తున్న పురోహితుడు



ఆగిరిపల్లిలో చంద్ర ప్రభ వాహనంపై శోభనాచలుడి గ్రామోత్సవం

## రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి..

**మైలవరం:** తెలుగు నూతన సంవత్సరాది అందరి జీవితాల్లో సంతోషం నింపాలని వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన ఉగాది వేడుకల్లో ఆయన పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీవితంలో తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, చేదు అనుభవాలను మర్చిపోతూ, ఆత్మీయ అనుబంధాన్ని పెంచుకుంటూ ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడాలని, పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆ భగవంతుని కోరుకున్నామని చెప్పారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడుల అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గర్నేపూడి వెంకట్రావు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### జగనన్నను మరోసారి ఆదరించండి



**ఆగిరిపల్లి:** సంక్షేమ పాలన కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు అన్నారు. మంగళవారం ఆగిరిపల్లి ఐదో వార్డులో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమని, మరోసారి జగనన్నను సీఎంగా గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. నూజివీడు ఎమ్మెల్యే అభ్యర్థిగా మేకా వెంకట ప్రతాప్ అప్పారావును గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఎంపీటీసీ సభ్యుడు సాదం గోపి, నాగుల్ మీరా, వైఎస్సార్ సీపీ నాయకులు నక్కనబోయిన పండు, వాకా సక్కేశ్వరరావు, చిమట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### నరసాపురంలో పంచాంగ శ్రవణం

**నరసాపురం(విస్సన్నపేట):** నరసాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన సూర్యదేవాలయంలో విశ్రాంత తెలుగు పండితులు రామశేషు ఉగాది పండుగ సందర్భంగా మంగళవారం పంచాంగ శ్రవణం చేశారు. భక్తులు దేవాలయంలో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

### సీఆర్‌కు ఘన నివాళి

**తిరువూరు:** కమ్యూనిస్టు యోధుడు చంద్ర రాజేశ్వరరావు (సీఆర్) వర్ధంతి కార్యక్రమం తిరువూరు సీపీఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికి, పటిష్టతకు చంద్ర చేసిన సేవలను పార్టీ జిల్లా శాఖ మాజీ కార్యదర్శి తూము కృష్ణయ్య వివరించారు. తిరువూరు ప్రాంతంతో రాజేశ్వరరావు అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రాజేశ్వరరావు చిత్రపటానికి సీపీఐ పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్, నియోజకవర్గ కార్యదర్శి నాగుల్‌మీరా, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సుబానీ, ఏఐటీయూసీ అధ్యక్షుడు మీరా పూలమాల వేసి నివాళులర్పించారు.

### చలివేంద్రం ప్రారంభం

**నూజివీడు:** వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు రోటరీ క్లబ్ కృషి చేస్తోందని ప్రముఖ వ్యాపారి మూల్పూరి లక్ష్మణస్వామి అన్నారు. పట్టణంలోని బస్టాండు ఆవరణలో రోటరీ క్లబ్ ఆఫ్ నూజివీడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం లక్ష్మణస్వామి ప్రారంభించి మాట్లాడారు. డిపో మేనేజర్ సీహెచ్ సూర్యపవన్‌కుమార్ మాట్లాడుతూ బస్టాండుకు వచ్చే ప్రయాణికుల కోసం చల్లటి నీటిని అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు గొల్లపూడి రవిబాబు, సెక్రటరీ పీడీ వెంకటరత్నం, మలిశెట్టి శ్రీనివాస్, యార్లగడ్డ రాజగోపాల్, శశికాంత్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

- **పుట్రేల (విస్సన్నపేట):** పుట్రేల గ్రామంలో మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయనరెడ్డి ప్రారంభించారు. సర్పంచ్ కారుమంచి స్వాతి, ఎంపీటీసీ గార్లపాటి నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ చైర్మన్ కోటగిరి నాగేశ్వరరావు, ఆర్య వైశ్య ప్రముఖుడు లక్ష్మయ్య పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే లక్ష్యంగా జగన్ పాలన



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని నాని, స్వామిదాసు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎంపీ కేశినేని నాని, స్వామిదాసు

ఎంపీ కేశినేని శ్రీనివాస్

**విస్సన్నపేట:** పార్టీలకతీతంగా పేదల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) అన్నారు. స్థానిక రెడ్డిగూడెం రోడ్డులోని వైఎస్సార్ సీపీ మండల పార్టీ కార్యాలయాన్ని ఎంపీ చేతుల మీదుగా మంగళవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని చెప్పారు. త్వరలో జరుగనున్న ఎన్నికల్లో తిరువూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

**టీడీపీ నుండి 100 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక**

విస్సన్నపేట మండలంలో నరసాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ నాయకులు అల్లు గణపతిరెడ్డి, మిద్దే నాగమయ్య, తాణంకి రాంబాబు ఆధ్వర్యంలో ఎంపీ కేశినేని నాని సమక్షంలో పార్టీలో చేరారు. అలాగే పుట్రేల, రామానగరం, కలగర గ్రామాలకు టీడీపీ నాయకులు ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, మండల పార్టీ అధ్యక్షుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ కేశినేని నాని సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ పార్టీ కండువా కప్పి ఎంపీ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, జెడ్పీటీసీ భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, జిల్లా కమిటీ సభ్యుడు సిరసాని ప్రకాష్, జేసీఎస్ మండల కన్వీనర్ అనుమోలు శివబాజీ, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, ఎంపీటీసీ జి. మల్లయ్య, కో-ఆప్షన్ సభ్యుడు జాఫర్‌బాబా, ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి శేషగిరి, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

### 12 మంది జూదరులపై కేసు నమోదు

**జి.కొండూరు:** మండల పరిధిలోని పలు గ్రామాల్లో కోడి పందేలు, పేకాట నిర్వహిస్తున్న పన్నెండు మందిని జి.కొండూరు పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ షబ్బీర్ అహ్మద్ మాట్లాడుతూ కుంటముక్కల గ్రామ శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి ఒక కోడిపుంజు, ఒక కోడి కత్తి, రూ.3,800 నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అదేవిధంగా మునగపాడు గ్రామ శివారులో పేకాట నిర్వహిస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,050 నగదును స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశామని వివరించారు.

### కోడి పందేల శిబిరంపై దాడి

**ఎ.కొండూరు:** కోమటికుంట గ్రామంలో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్ఐ చల్లా కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కోమటికుంట గ్రామంలో కోడిపందేల శిబిరంపై దాడిచేసి పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు కోడి పుంజులు, రెండు కోడికత్తులు, రూ. 20 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేశారు.

## జగన్ ప్రభుత్వంలో మైనార్టీలకు ప్రాధాన్యం

**భవానీపురం(విజయవాడపశ్చిమ):** పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా గొల్లపూడి గ్రామ కంఠంలోని మసీదు, మౌలానగర్‌లోని మసీదులో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మైలవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు పాల్గొన్నారు. ఆయా మసీదుల్లోని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లిం మైనార్టీలకు భోజనం వడ్డించి మాట్లాడారు.

**తిరువూరు:** రంజాన్ మాసం సందర్భంగా తిరువూరులో ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలకు వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని), తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు మంగళవారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. స్థానిక షాదీఖానాలో ఏర్పాటు చేసిన విందులో వీరు పాల్గొన్నారు. రంజాన్ మాసంలో ఉపవాసదీక్షలు చేస్తున్న ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాల ముస్లిం నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు, మత పెద్దలు పాల్గొన్నారు.

**ఊటుకూరు(గంపలగూడెం):** మండలంలోని ఊటుకూరులో ఉపవాస దీక్షలో పాల్గొన్న ముస్లింలకు వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు, సొసైటీ అధ్యక్షుడు ఆలపాటి ఉమామహేశ్వరరావు సౌజన్యంలో మంగళవారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక రామిశెట్టి వేణుగోపాలరావు కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో 250 మంది ముస్లింలు పాల్గొన్నారు. ముందుగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

- **నూజివీడు:** ఇఫ్తార్ విందుతో సోదరభావం పెంపొందుతుందని ఎమ్మెల్యే మేకా ప్రతాప్ తనయుడు, నియోజకవర్గ నాయకుడు మేకా వేణుగోపాల అప్పారావు (చంటినాయన) అన్నారు. బోర్వంచలోని మసీదులో మంగళవారం ముస్లింలకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఇఫ్తార్ ప్రత్యేక నమాజులో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు చంటినాయన భోజనాలు వడ్డించారు. జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ముస్లిం నాయకులు గబ్బర్, మస్తాన్, సలీం, ఖైజర్‌పాషా, మహమ్మద్ అర్షద్, నజీవుల్లా, లియాఖత్, ఆరేపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



తిరువూరులో ముస్లింలకు భోజనం వడ్డిస్తున్న ఎంపీ నాని, స్వామిదాసు



గొల్లపూడి ఇఫ్తార్ విందులో భోజనం వడ్డిస్తున్న తిరుపతిరావు



బోర్వంచ ఇఫ్తార్ విందులో భోజనం వడ్డిస్తున్న చంటినాయన

# స్వగ్రామంలోనే అన్ని సేవలు

- రూ.10.51 కోట్లతో ఆర్బీకేల నిర్మాణం
- నియోజకవర్గంలో 62 వేల మంది రైతులకు మేలు
- విత్తు నుంచి విక్రయం వరకు అందుతున్న సేవలు
- జగన్ ప్రభుత్వంపై రైతుల హర్షం

**నూజివీడు:** వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక స్వగ్రామంలోనే రైతులకు తమకు అవసరమైన సేవలు అందుతున్నాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామీణ స్థాయిలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పచ్చిరొట్ట, ధాన్యం, మొక్కజొన్న, మినుము, పెసలు విత్తనాలతో పాటు ఎరువులు, పురుగు మందులను రైతులకు అందుబాటులో ఉంచారు. బీమా సదుపాయం, ఈ క్రాప్ రైతు భరోసా కేంద్రంలో ఉండే ఉద్యాన, వ్యవసాయ సహాయకులతో పంటను సాగు చేసిన వెంటనే నమోదు చేయించుకుంటున్నారు. ఇలా ప్రభుత్వం అన్ని సేవలను మండల కేంద్రానికి వెళ్లే పనిలేకుండా రైతులకు ఆర్బీకేలోనే అందిస్తోంది. గత ప్రభుత్వంలో రైతులకు ఏ చిన్న అవసరం వచ్చినా పనులు మానుకుని 15 కిలోమీటర్ల దూరంలో ఉండే మండల కేంద్రంలోని వ్యవసాయాధికారి కార్యాలయానికి వెళ్లాల్సివచ్చేది.

### 78 రైతు భరోసా కేంద్రాలు

నూజివీడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రైతులకు ప్రభుత్వ సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10.51 కోట్లు వెచ్చించి 78 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో ఉద్యాన, వ్యవసాయ సహాయకులు తదితరులు 62 మందిని నియమించింది. వీరు ప్రభుత్వ సేవలను 62 వేల మంది రైతుల గడప వద్దే అందిస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనడం, పొలంబడులు నిర్వహించి రైతులకు పంటల సాగులో సలహాలు, సూచనలు అందించడం, రాయితీపై ధాన్యం విత్తనాల విక్రయం, పచ్చిరొట్ట విత్తనాలు, రసాయన ఎరువుల విక్రయించడం, తుపానుల సమయంలో పంట నష్టపోయిన రైతుల జాబితాల తయారీ, ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీ, ఆదర్శ రైతుల ఎంపిక, పంటల సాగులో ఆచరించాల్సిన సస్యరక్షణ పద్ధతులపై రైతులకు గ్రామ స్థాయిలోనే అవగాహన కల్పిస్తున్నారు. రైతులు తమకు కావాల్సిన పథకానికి రైతు భరోసా కేంద్రంలోనే దరఖాస్తు చేసుకుంటున్నారు. గతంలో వీటిల్లో ఏ పని కావాలన్నా మండల కేంద్రంలోని వ్యవసాయాధికారి కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరగాల్సి వచ్చేది. నేడు రైతుల గడప వద్దకే ప్రభుత్వం సేవలను అందిస్తోంది.



నూజివీడు మండలం తుక్కులూరు రైతు భరోసా కేంద్రం



నూజివీడు మండలం దేవరగుంట రైతు భరోసా కేంద్రం





నూజివీడు మండలం జంగంగూడెం రైతు భరోసా కేంద్రం



నూజివీడు మండలం బోర్వంచ రైతు భరోసా కేంద్రం

### రైతులకు ఎంతో మేలు



గతంలో ఎరువులు, విత్తనాలు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లేవాళ్లం. ఇప్పుడు ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదు. గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలోనే విత్తనాలు, ఎరువులు, పచ్చిరొట్ట విత్తనాలు తదితరాలన్నీ లభిస్తున్నాయి. రైతులకు అవసరమైన సేవలన్నీ రైతు భరోసా కేంద్రాల్లోనే అందుతున్నాయి.

– పల్నాటి రఘు, దేవరగుంట, నూజివీడు మండలం

### సాగులో సలహాలు, సూచనలు ఇస్తున్నారు



రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం చేస్తున్న కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. రైతు భరోసా కేంద్రాల్లోని సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి పంటల సాగులో సలహాలు, సూచనలు అందిస్తున్నారు. ఈ–క్రాప్ బుకింగ్ త్వరితంగా చేసి రైతు భరోసా నిధులు వచ్చేలా చేస్తున్నారు. విత్తనాలు, ఎరువులు, పచ్చిరొట్ట విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో మండల కేంద్రానికి వెళ్లాల్సిన పనిలేకుండా పోయింది.

– పాలడుగు విజయ్‌కుమార్, తుక్కులూరు, నూజివీడు మండలం

### స్కూల్ అకౌంటెంట్‌ను బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు

**ఇబ్రహీంపట్నం:** ఓ స్కూల్ అకౌంటెంట్‌ను బెదిరించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఎం. సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక సెయింట్ జేవియర్ పాఠశాలలో జ్యోతి అకౌంటెంట్‌గా పనిచేస్తోంది. అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థి స్కూల్ ఫీజు చెల్లించాలని సదరు విద్యార్థి తండ్రి కొప్పనాతి వెంకటేశ్వరరావును ఈనెల 8వ తేదీన ఆమె కోరింది. దీనిపై ఆగ్రహించిన వెంకటేశ్వరరావు ఆమెతో దురుసుగా మాట్లాడటంతోపాటు ఆమెపైకి దూసుకు వెళ్లి నీ అంతు చూస్తానని బెదిరించాడు. భయపడిన జ్యోతి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### వ్యక్తిపై వేధింపుల కేసు నమోదు

**ముసునూరు:** ఓ యువతిని తరచూ వేధింపులకు గురిచేస్తున్న ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. కాట్రేనిపాడుకు చెందిన యువతిని అదే గ్రామానికి చెందిన కోరు రత్నకుమార్ అనే వ్యక్తి ప్రేమించాలంటూ ఫోన్‌లో గత కొంత కాలంగా మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో ఆ యువతి అతని నంబర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టింది. అయినా ఆగకుండా రత్నకుమార్ యువతి తల్లికి ఫోన్ చేసి దూషించడమే కాక యువతి ఫొటోలను సోషల్ మీడియాలో పెడతానంటూ బెదిరిస్తున్నాడు. విసిగిపోయిన యువతి మంగళవారం ముసునూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

### పేకాట శిబిరంపై దాడి

**ముసునూరు:** పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. గోపవరంలో అతి రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై మంగళవారం ఎస్ఐ వాసు సిబ్బందితో కలిసి దాడి చేశారు. నలుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను బుధవారం నూజివీడు కోర్టుకు తరలిస్తారు.

### మజ్జిగ పంపిణీ

**నూజివీడు:** పట్టణంలోని పెద్ద గాంధీ బొమ్మ సెంటర్‌లో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో బాటసారులకు మజ్జిగను పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి పరిశే రంగారావు 600 మందికి మజ్జిగను అందజేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ప్రతినిధులు వనమా వెంకటేశ్వరరావు, మానేపల్లి సతీష్, చిన్నం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.